ఎవరికీ ఏ కోశమందూ పోలేదు. మఱి పోస్టుమాస్టర్ను, బంట్రోతుల్ను విచారించారు. అది తమ ఆఫీసు సిరా అవుగాక, ఎవరు వ్రాశారో తమకు ఎఱుక లేదన్నారు. రిజల్టు! డాక్టరుగారు రోగి మీద తెచ్చిన దావా ఖర్చుల సమేతంగా కొట్టివేసినారు!

ఇంటికి వచ్చి కల్యాణసింగు తండ్రి, దావా నెగ్గిన విజయోత్సాహంలో నిజం స్ఫురించిందికాబోసు. " ఒరే సింగూ! నీవుగాని ఆనాడు ఎమ్. బి. బి. ఎస్. కొట్టివేసి " హార్టులెస్ " యని వ్రాశావా ఏంట్రా ? " యని అడిగాడు. కళ్యాణసింగు " మఱే! అడుగడుక్కీ ఆ డాక్టరు డబ్బు అడగడం చూస్తే, నాకు మా! అసహ్యం వేసింది సుమండీ! ఇంతడబ్బూ పుచ్చుకుంటూ పిల్చినప్పుడు రాకపోవడం! అసలు మొన్న అట్లతద్దికి ఆయన బోర్డుమీదున్న అక్షరాలు కూడా కొట్టివేసి. హెచ్. ఎల్. అని వ్రాసెయ్యాలనుకున్నాను. అయితే బోర్డు నాకు అందింది కాదు." అన్నాడు. " మఱి పొడుగెదిగాక చేసేవు గనుక! అలాంటి పనులెప్పుడూ చేయకు!" అని తండ్రి మందలించాడు. కాని కొడుకు " అది యంత పెద్దమాట అయితే దానిమీద పోస్టల్‌వాళ్ళు ఓ ముద్రకొట్టేయలేక పోయినారూ ?" అంటూ కొడుకు కళ్యాణసింగు పంచకల్యాణి గుఱ్ఱంలా పంచబంగాళమయ్యాడు!

.... .... .... .... ....

## పూజా పుష్పాలు

పూర్వం రిక్షాను అనంతశయనంతో పోల్చేవారు. అట్టేమంది ఎక్కేవారుకారు. అందులోను హిందువులు యసలే ఎక్కేవారు

కారు. చిన్నచిన్న పట్నాల్లో దాన్ని వాడేవారేకారు. చన్న పట్నం వంటి రాజధానుల్లోనైనా దొరసానులు దొరలూ ఎక్కుతూ వుండేవారు. ఇప్పుడు రానురాను " రిక్షా " అన్నది విశాఖపట్నం లోనూ, కాకినాడలోనూ, రాజమహేంద్రవరంలోనూ కూడా రస్తాలమ్మట లాగబడుతూవుంది. సత్తెకాలపు వితంతువులచేత కూడా నిరసింపబడుతూవున్నట్టు తోచదు. లాగేవానిలో నాగరకత ప్రబలింది. సొగుడులో దాని ఏకండీమువ్వ " దయచేసి తప్పుకోండి " అన్నట్టు రుతిస్తూ దారిపోయేవాళ్ళ చూపుల్ని తనవంకకు త్రిప్పుకొని జీవకళ చూపెడుతూవుంది.

అయితే ఈ జీవకళ రిక్షానుబట్టి వస్తూవుందా, రిక్షాలోకి ఎక్కేవాళ్ళనుబట్టి వస్తూవుందా యని యోచిస్తే దేహీదేహాల యొక్క అవినాభావం ఎట్టిదో ఆ కాన్వేపూ ఆ రిక్షాకూ ఆశ్రయాశీకునకు యట్టి అవినాభావమే!—విడదీసి చూపించలేం ఆ జీవకళను.

" అమృత్ ఖుషీబాయి " అప్పుడే దిగిన రిక్షా అది. ఆమె వొదులొదులుజడ! రిబ్బను తుదలుగాని పట్టుతాళ్ళుగాని ఎన్నడూకోరని ఆ నిడుదజడలో ఆ పెడదజడలో ఆ పువ్వులు గుదులుగుదులుగా—దారిపొడుగుతా జారిపడ్డానికే గ్రుచ్చబడ్డాయా అన్నంత విలాసంగా—ఎంతోమందికి కనిపించి కనిపించి కని పించి మురిపించి మురిపించి, ఏలా విదిలిపడ్డాయో—ఆమె దిగి వెళ్ళిపోయినా ఓ పూస్తబకం ఒకానొక రిక్షామెత్తపైని మిగిలి వుంది. ఆ మిగిలియున్న పూస్తబకాన్ని ఎదో మహావిశేషంగా కనుగొంటూ " దివ్యస్థూలపుమహేంద్రరావు " ఎక్కాడు, ఆమె దిగినవెంటనే యదే రిక్షాలోకి.

రిక్షావాలా. "బాబూ! మీదే యీ పొద్దుబోణీ! రూపా యిప్పించాలండి బాబూ!" అన్నాడు, రిక్షాతొమ్ము పైకెత్తుతూ. మహేంద్రరావు "నే చూడకపోతే తెల్లాలనే లేదందువు;" రిక్షావాడు, ఎక్కడకని అడక్కుండానే రిక్షాకు ఊతంలాగుడిచ్చి, ఆగి "ఆ పువ్వులు సూచి యిప్పుడే ఎవరో ఎక్కిదిగారు యని అనుకుంటున్నారు కామోసు బాబులు. అవి నా పూజాపుష్పాలు. తెల్లాలకుండానే నా రిక్షాను నేను పూజించుకొన్న పువ్వులవి. తంవరిదే బోణీ! రూపాయ పూర్తిగా ఇప్పించాలి! సోల్జర్లిస్తున్నారు! సూదమ్మలిస్తున్నారు! ఎవరిచ్చినా రూపాయకు తక్కువ ఎవరూ ఇవ్వడంలేదు బాబూ-ఎక్కడికి తీసుకువెళ్ళినా అంతేరేటు" అన్నాడు.

"సోల్జర్లంటే విన్నాను. సూదమ్మ లెవర్రా?"

"ఆడడాక్టర్లు బాబయ్యా!"

మహేంద్రరావు "ఇప్పుడు దిగినావిడ సూదమ్మా!" వాడు "చూడారా తంవరు ఆమెను: ఒకపర్యాయం దిగుండి! దులిపేస్తాను ఆ వాడుపువ్వులు" అన్నాడు. మహేంద్రరావు ఓ పువ్వు యీదాలాపంగా తీసినట్టు పైకెత్తిచూస్తూ "దుల పక్కలేదు. పువ్వులు వాడలేదు. రేకులూడలేదు. ఆమె అసలు నీ రిక్షాలో జేర్లబడ్డ నలుగుడైనా పొందలేదు. లాగు! త్వరగా లాగు"—ఎక్కడికో బాబులు సెలవిచ్చారుకారు" "ఎక్కడికో వోచోటికి, నీ యిష్టము వచ్చినచోటికి. ఇదిగో రూపాయి తీసుకో! ముందుగానే యిస్తూవున్నాను. ఉత్సాహంగా లాగు! అమితోత్సాహంగా లాగు" అని హెచ్చరించాడు మహేంద్రరావు.

రిక్షావాడు లోనివాని క్కావలసినంత పీకబిగిని మిక్కిలి వడిగా లాగడమేగాకుండా, లాగుతూన్నంతసేపూ యిలా వాగాడుకూడాను.

" బాబూ! యీ వూరివాళ్ళకెవళ్ళకూ రిక్షాలాగడమే తెలియదండి. నా దసలు రంగం! అక్కడ నేరిసిందే యిదంతా. చిన్నప్పట్నుంచీ రంగాని కలవాటు పడ్డానేమో నాకీవూరసలో వూరాయని అనిపిస్తుంది. నా పిల్లలతల్లి తల్లిగారి వూరుచెట్టాలో వోపల్లెటూరు. అదక్కడే వుంటానంటుంది. నాను రంగంలో యున్నప్పుడుకూడా యది దాని అమ్మగారింటే ఉండేది. నాపని అల్లా దానికి నానెక్కడున్నా పసుపూ బట్టా పంపుతూయుండడమే. మఱి నా పూచీలేదు. పేచీలేదు. అదక్కడే వుంటాను అంటుంది. ఇక్కడకు రానంటది. అక్కడేముందే యంటే యినిపించుకోదు. నాకు నెగిసేతలికి కాఫీవుండాలి. సందెలదేసరికి పారాకావాలి. ఆ పల్లెటూరిలో దొరుకుతుందా బాబూ! మఱి వానాకాలంలో రోడ్డులేని ఆ వూళ్లో మోకాలిబంటి బురదా, బందా!! నాకు ఆ బందలో అడుగెట్టడమంటే గొందిలో సడిసినట్టుంటుంది. నా పెళ్ళాం ఆ బందలోనే ఆలా వూడుస్తానంటుంది. మఱి దాని సరదా ఏంటో దాని సవిఖ్యం ఏంటో—అవితే వొకటుందిలేండి బాబూ—దంపుకెళ్ళి గొప్పుకెళ్ళి రోజూ శేరుశేరున్నర బియ్యమో కుంచెడు రెండు కుంచాల నూకలో తీసుకొస్తుంది. తను తింటూ పిల్లలకెట్టుకుంటుంది. అవితే యది తెచ్చిందికదా యని నా కాపల్లె టూరిలో వూరికే కూకుని బొక్కుతూంటే ఆ బోణం అహోదు. అరగదు. తిరగాలినేను. ఈ రిక్షా కొమ్ము పుచ్చుకు వూ తిరగాలి-తిరగాలి—" అంటూ వొక " ఆకాశమల్లి " తరుచ్ఛాయకు ఆ రిక్షాతీసి—

" ఈ చెట్టునీడ నాకు ఇష్టం! బాబయ్యా! ఇక్కడే ఈ చెట్టుకింద ఇలా ఈ రిక్షావుంచి ఎక్కడికన్నా పోయి, ప్రతీ

నరమానవుడికీ స్నానం పానం వుంటాయిగా—అవన్నీ కానిచ్చు
కుని మళ్ళీ తిరిగొచ్చి యిక్కడ్నే తొంగుంటాను—రోజూ నాకు
తులం నల్లమందు ఉండాలి. తులం మందు ఈ రోజుల్లో ఎన్ని
రూపాయలో తమకే తెలుసుగందా! ఈ చెట్టునీడకంటె ఎక్కువ
యిష్టమైంది నాకు మరొక్కటి లేదు బాబయ్యా! రమ్మంటే
రాదీకాడికి నా పిల్లల తల్లి—ఆ పిల్లలూ యంతే బాబయ్యా.!
అళ్ళూ ఆ పల్లెటూరిలోనే ఆఘోరిస్తామంటారుగాని యిక్కడ
పోనీ యీ పట్నవాసపు "సితరవిసితర" జీవనం గడిపి చూదాం
అని యనుకోరు అదేం ఖర్మమో—యీ చెట్టునీడకంటే ఎక్కువ
యిష్టమయింది నాకు మరొక్కటిలేదు. ఇదేయిల్లు యిదేయిళ్వం.
నా స్వర్గం యీ చెట్టు కొమ్మలోనేవుందని నా నమ్మకం—సూశారా
బాబులూ! ఇలా ఈ చెట్టుక్రింద రిక్షావుంచి నే కునుకోతానా,
తెల్లాతేసరికి వేలకొద్ది పువ్వులు గమగమామంటా నా రిక్షానిండా
పడివుంటాయి. ఈ పొద్దు సూదమ్మగారు ముందుగుండా ఎక్కి
నారు రిక్షా—ఆమె ఆ పువ్వులన్నీ గుత్తులు గుత్తులుగా కట్టుకు
జుత్తులో పెట్టుకున్నారు—కొన్నెట్టుకు కొన్నిందులోనే యట్టే
పెట్టేశారు లాగుంది. తమరందుకున్నారు! నా భాగ్యం!
యీ చెట్టు నీడకంటె నాకిష్టమయింది మరొక్కటి లేదు—"
యంటూ రిక్షా నిలిపేశాడు ఓ నీడపట్టున.

దివ్యస్థూలపు మహేంద్రరావు రిక్షా దిగుతూ తనచేతబట్టిన
పూలగుత్తిని తిరిగి రిక్షా మెత్తమీద ఉంచుతూ "ఇవిగో
నీ పూజాపుష్పాలు!" అన్నాడు. రిక్షావాడు "తంవరో మాపెత్తు
కున్నాక తంవరివే. నాక్కావలసినవన్నీ యీ కాడనుంచి
యీ పువ్వులు! పైరుగాలందుకుని తెగరాలుస్తుంది యీ చెట్టు.

తెల్లవార్లూ వోనకురిసినట్టే పరిమళం ! మఱిదేనిమీదకూ బమార నివదు " యంటూ ఆ చెట్టువంక తిలకించాడు.

వానిమీద వాని రిక్షామీద మహేంద్రరావు మీద ఎంత గొప్పగా క్రొంగ్రొత్త పువ్వులు రాలాయో చెప్పలేం. ఎన్ని రాలాయో లెక్కపెట్టలేం. ఎందుకు రాలాయో కనిపెట్టలేం !

.... .... .... .... ....

## సర్వమంగళ భద్రేశ్వరుని నిరాటంక ఇష్టావాప్తి

యుద్ధానంతరం శాంతి ఉంటుందని, సౌఖ్యము ఉంటుందని చాలా మంది యనుకున్నారుగాని, సర్వమంగళ భద్రేశ్వరునకు " శాంతములేదు, సౌఖ్యము " లేదు. సన్యసిస్తే మెఱుగని పించింది. ఇంట్లో పెద్ద జంఝాటన ఉందా యంటే అట్లాంటిది ఉన్నవాడుకాదు. జననివి తప్పిస్తే అతడు పోషించవలసిన మఱో ప్రాణి ఈ లోకంలో లేదు సర్వమంగళ భద్రేశ్వరునకు.

తల్లిదండ్రుడు లితగ్గానికి ఇంత పెద్ద పేరుంచడంలో ఏకాభి ప్రాయానికి వచ్చింది " సోమలింగం " సామెతనుగాకుండా. పిండం కడుపున బడ్డాకే ! తల్లి కలా వేవిళ్ళు పిల్లడి కిలా పేరూ యనుకోండి. ఏ కారణంచేతనో పుట్టేది మగశిశువు యనే నిర్ధా రించుకున్నారు ఆ దంపతులు, వారిలో ఒకరికి నెల దప్పిందీ యని అనడంతోనే—మగవానికి నెల తప్పడమేమిటిలెండి— తప్పింది స్త్రీకే. కాని చిత్రమేమిటంటే, నిర్ధారించుకొన్నట్టు జరిగింది. జరిగినట్టుగానే యనుకొన్న నామధేయం ఉంచారు. " సర్వా ! సర్వమంగళా ! సర్వమంగళభద్రా ! సర్వమంగళ